కూలీల కొరత.. చేనులోనే పత్తి పంట



బయ్యారం గ్రామంలో చేనులో విరబూసి కనిపిస్తున్న పత్తి పంట

గజ్వేల్, జనవరి 9 : కూలీల కొరత కారణంగా పత్తి పంట చాలా వరకు చేన్లలోనే కనిపిస్తున్నది. పత్తి తీసేందుకు కూలీలు ముందుకు రాకపోవడంలో మండల పరిధిలోని రిమ్మనగూడ, బయ్యారం, దాచారం, దాతర్‌పల్లి గ్రామాల్లో ఎక్కువగా పొలంలోనే కనిపిస్తుంది. గ్రామాల్లో కూలీలు తక్కువ సంఖ్యలో ఉండడంతో పత్తి తీసేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అన్నిరకాల పంటలను కోసేందుకు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ, పత్తి పంటను మాత్రం నేరుగా కూలీలే తీయాలి. పత్తిని తీసేందుకు ప్రారంభంలో కూలీలు అందుబాటులో ఉన్నప్పటికీ చివర్లో మాత్రం ఇబ్బందిగా ఉంటుంది.

గజ్వేల్‌లో ఆర్టీసీ కార్మికుల వనభోజనాలు

గజ్వేల్, జనవరి 9 : గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లతో కలిసి సిబ్బంది మంగళవారం వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. వనభోజనాల అనంతరం కార్మికులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ డిపో రీజినల్ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కార్మికులు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో డీఎం సురేఖ, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో మశ్చేందర్, ఎంఈవో సునీత

గజ్వేల్ అర్బన్, జనవరి 9 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తున్నదని ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఊడెం వేమారెడ్డి, తిగుళ్ల లింగం అన్నారు. మంగళవారం గజ్వేల్ ఐవోసీ ప్రాంగణంలో ఎంపీడీవో మశ్చేందర్, ఎంఈవో సునీత, మండల నోడల్ అధికారి కృష్ణ చేతుల మీదుగా పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుగుణాకర్, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శివశంకర్, బాలు చరణ్, పోచయ్యగౌడ్, భాస్కర్, నాగరాజు, వెంకటేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కోహెడలో క్యాలెండర్ ఆవిష్కరణ..

కోహెడ, జనవరి 9 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను పీఆర్టీయూ మండల అధ్యక్షుడు దర్శనాల నారాయణ, కార్యదర్శి కాశబోయిన ఓదేలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అన్నాడి మహేందర్ రెడ్డి, ముత్యాల సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పద్మ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎండీ మహమూద్, కృష్ణారెడ్డి, విజయలక్ష్మి, పి.లక్ష్మి, నగేశ్, సంపత్, మనోహర్, సద్గుణాచారి, రామకృష్ణ, శ్రీరాములు, రాజిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి

అక్కన్నపేట, జనవరి 9 : ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని ఎంఈవో నర్సింహారెడ్డి, అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేసిన గంగాధర్, రవీందర్ బదిలీ కావడంతో మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకిత భావంతో పని చేసే ఉద్యోగులకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పీరెల్ల రాధారవీందర్, ప్రధానోపాధ్యాయులు రంగ, చంద్రశేఖర్, సంధ్యారాణి, కనకయ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, రాజేంద్రప్రసాద్, చిత్తరంజన్, రవికుమార్, జగమాల్, రమణారెడ్డి, శారద, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు 'భగీరథ'తో పరిష్కారం

పిట్టలగూడెంలో తాగునీటి నల్లాను ప్రారంభిస్తున్న సర్పంచ్ రవీందర్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 9 : గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు సర్పంచ్ ఊట్ల రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మద్దూరు మండలం ధర్మారం గ్రామ శివారు పిట్టలగూడెంలో ఏర్పాటు చేసిన తాగునీటి నల్లాలను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం రూ.13 లక్షలతో పిట్టలగూడెంలో మిషన్ భగీరథ ట్యాంక్‌ను నిర్మించిందన్నారు. అయితే, వాటర్‌ట్యాంక్‌కు మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో కొన్ని రోజులుగా గూడెంవాసులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. దీంతో గ్రామ పంచాయతీ బోరుమోటర్ సహాయంతో భగీరథ ట్యాంక్‌కు నీరు ఎక్కించి గూడెంలో తాగునీటి సమస్యను పరిష్కరించానని తెలిపారు.

'గోపాలమిత్ర'ను సద్వినియోగం చేసుకోవాలి

వర్గల్, జనవరి 9: పాడిరైతులు గోపాలమిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని వర్గల్ పశువైద్యాధికారి మోహన్‌లాల్ సూచించారు. మంగళవారం మండలంలోని మాదారం గ్రామంలో పశుగాణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ మాట్లాడుతూ పాడి పరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. 14 పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు, 12 సాధారణ పరీక్షలు, 23 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సంఘం రాష్ట్ర నాయకులు శ్రీరాములు, సర్పంచ్ రామచంద్రం, సూపర్‌వైజర్లు భాస్కర్‌గౌడ్, ఆంజనేయులు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు

శుభాకాంక్షలు తెలుపుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, జనవరి 9 : దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి మెదక్ జిల్లా రివ్యూ మీటింగ్‌కు హాజరైన శ్రీనివాస్‌రెడ్డి సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కరాటే పోటీల్లో గురుకుల విద్యార్థినికి గోల్డ్‌మెడల్

చేర్యాల, జనవరి 9 : పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని ఎం.ఉదయ కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్‌లో 45 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని ఉదయను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

బంగారు పతకం సాధించిన విద్యార్థి ఉదయను అభినందిస్తున్న దృశ్యం

'మల్లన్న' ఆలయంలో అంతర్గత బదిలీలు

చేర్యాల, జనవరి 9 : కొమురవెల్లి మల్లన్న ఆలయంలో అంతర్గత బదిలీలు జరిగాయి. మూడు రోజులపాటు జరిగిన కల్యాణ మహోత్సవం పూర్తి కాగానే ఆలయ ఈవో బాలాజీ పలువురు ఉద్యోగులను ఇతర శాఖలకు మార్చారు. శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న విజయ్‌కుమార్‌ను ఎల్లమ్మ ఆలయం వద్ద విధుల నిర్వహణకు, లడ్డూ, ప్రసాదాల విభాగంలో పనిచేస్తున్న బత్తిని నవీన్‌ను శానిటేషన్‌కు, ఆలయ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సందీప్‌ను గదుల విచారణకు మార్చారు. గదుల విచారణలో విధులు నిర్వహిస్తున్న వెంకటచారిని లడ్డూ ప్రసాదాల విభాగానికి బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

డ్రైవర్‌కు మెమో జారీ..

ఆలయానికి సంబంధించి చెత్త రవాణా చేసే ట్రాక్టర్ డ్రైవర్‌కు ఆలయ ఈవో మెమో జారీ చేశారు. స్వామివారి కల్యాణోత్సవం రోజున చెత్తను తరలించే ట్రాక్టర్‌ను నడిరోడ్డుపై వదిలిపెట్టి కొంతసేపు కనిపించకుండా వెళ్లిపోయాడు. ఇది గమనించిన పలువురు ప్రభుత్వశాఖల సిబ్బంది అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ఆలయానికి ఫోన్ చేసి చెత్త రవాణా చేసే ట్రాక్టర్ ఎందుకు రోడ్డుపై గంటల తరబడి ఉందని..? డ్రైవర్ ఎక్కడికిపోయాడనే విషయంపై ఆరా తీశారు. దీంతో ఆలయ ఈవో డ్రైవర్‌కు మెమో జారీ చేశారు.

పరుపులు మాయం

కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవం రోజున మంత్రులు, ఎమ్మెల్యేల కోసం కల్యాణ వేదిక పక్కనే పరుపులు వేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, పునరుద్ధరణ కమిటీ సభ్యులు, వీవీఐపీలు స్వామివారి కల్యాణం ముగిసిన తర్వాత వెళ్లిపోవడంతో కొన్ని పరుపులను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మాయం చేసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

డివిజనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

క్రీడాకారులతో నిర్వాహకులు, నాయకులు

హుస్నాబాద్ రూరల్, జనవరి 9 : మండలంలోని కూచనపల్లి గ్రామంలో మడప రాంరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ మడప జైపాల్‌రెడ్డి నిర్వహిస్తున్న కేపీఎల్ సీజన్-3 డివిజనల్ స్థాయి టోర్నమెంట్‌ను మంగళవారం సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కేడం లింగమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచులు రామచంద్రారెడ్డి, తోడేటి రమేశ్, ముత్యాల సంజీవరెడ్డి, ఎంపీటీసీ జయలక్ష్మి, మాజీ సింగిల్ విండో చైర్మన్ ముత్తినేని అశోక్‌రావు, నాయకులు మడప యాదవరెడ్డి, మామిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించాలని వినతి

పీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ పరమేశ్వర్

చేర్యాల, జనవరి 9 : వరంగల్ ఎంపీ టికెట్ తనకు కేటాయించాలని చేర్యాల మాజీ ఎంపీపీ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్‌మున్షీని మాజీ ఎంపీపీ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009, 2014 ఎన్నికల్లో వరంగల్ ఎంపీగా పోటీ చేసి తాను స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయినట్లు గుర్తుచేశారు. వరంగల్ జిల్లా రాజకీయాలపై పూర్తి అవగాహన కలిగిన ఉన్న తనకు ఎంపీ టికెట్ కేటాయించాలని కోరారు.

వెదసాగులో ముందంజ

మర్కూక్, జనవరి 9 : వెద్దజల్లే సాగు పద్ధతిలో మర్కూక్ మండలం రాష్ట్రంలోనే ముందంజలో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలో వెదజల్లే పద్ధతి ద్వారా పంట సాగు చేస్తున్న రైతుల పొలాలను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. నూజివీడు విత్తన కంపెనీ ద్వారా 150 ఎకరాలకు మందులు అందజేయడంతోపాటు 450 ఎకరాల్లో వరిసాగు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అధికారులు విష్ణువర్ధన్, అశ్విని ఉన్నారు.

మద్దూరులో టీపీటీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 9 : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ ప్రోగ్రెస్ టీచర్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) మండల అధ్యక్షుడు బోకూరి బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం టీపీటీఎఫ్ సీనియర్ నాయకుడు గుడిసె అంజయ్య చేతుల మీదుగా టీపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఈగ ఆంజనేయులు, ధూళిమిట్ట మండల ప్రధాన కార్యదర్శి సమ్మయ్య పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

మద్దూరు మండల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల నోడల్ ఆఫీసర్ వరదరాజు, కాంప్లెక్స్ హెచ్‌ఎమ్ చంద్రశేఖర్ ఆవిష్కరించారు.

ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

సిద్దిపేట కమాన్, జనవరి 9 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణకుమార్, జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ సభ్యులు వెంకటేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ తదితరులున్నారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

గజ్వేల్, జనవరి 9 : బిల్కిస్ కేసులో 11 మంది దోషులను విడుదల చేయడాన్ని గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న చట్టవ్యతిరేకమైన నిర్ణయాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చిందన్నారు. నేడు దేశ వ్యాప్తంగా అన్ని ప్రజాసంఘాలు సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాయని తెలిపారు. ఈ కేసులో 11 మందిని ముందస్తుగా విడుదల చేయడాన్ని రద్దు చేయడంతో న్యాయస్థానాలపై ప్రజలకు మరింత నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. గుజరాత్ ప్రభుత్వం దోషులను విడుదల చేయడానికి తీసుకున్న నిర్ణయంపై ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, మేధావులు ఖండించారన్నారు. దోషుల క్షమ బిక్షను రద్దు చేస్తూ వారిని రెండువారాల్లో తిరిగి జైలుకు పంపాలని కోర్టు ఆదేశించడంతో నేడు మహిళాలోకం హర్షం వ్యక్తం చేస్తున్నదన్నారు.

జక్కాపూర్ విద్యార్థినికి బాలసాహిత్య పురస్కారం

భువనేశ్వరి

నారాయణరావుపేట, జనవరి 9 : మాచిరాజు బాలసాహిత్య పీఠం ప్రకటించిన బాలసాహిత్య పురస్కారానికి జక్కాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని దుబ్బాక భుననేశ్వరి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ షౌకత్ అలీ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్తమ కథలు రాసిన 20 మంది బాలలను ఎంపిక చేశారని, ఇందులో భువనేశ్వరి రాసిన 'నమ్మిన వారికి ద్రోహం చేయకు' అనే కథకు పురస్కారం లభించిందన్నారు. భువనేశ్వరిని ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు అభినందించారు.

బీఆర్ఎస్ నాయకురాలి మృతి

హన్మవ్వ (ఫైల్)

నారాయణరావుపేట, జనవరి 9 : మండల పరిధిలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మోతె హన్మవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మంగళవారం హన్మవ్వ మృతికి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. హన్మవ్వ మృతి బాధాకరమని, ఆమె పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రేపు మద్దూరులో బీఆర్ఎస్ కృతజ్ఞత సభ

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 9 : మద్దూరు మండల కేంద్రంలోని తాజ్‌మహల్ గార్డెన్‌లో ఈనెల 11న(రేపు) బీఆర్ఎస్ మద్దూరు, ధూళిమిట్ట మండల శాఖల ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మద్దూరు, ధూళిమిట్ట మండలాల అధ్యక్షులు మేక సంతోశ్‌కుమార్, మంద యాదగిరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సభకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఫాతిమా షేక్ చరిత్రను అన్నిభాషల్లో ప్రవేశపెట్టాలి

ఫాతిమా షేక్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

హుస్నాబాద్ టౌన్, జనవరి 9 : చదువుల తల్లి ఫాతిమా షేక్ చరిత్రను అన్నిభాషల్లో ప్రవేశపెట్టాలని ప్రజా సంఘాల నాయకుడు మేకల వీరన్నయాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలితరం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతిని మంగళవారం హుస్నాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరన్నయాదవ్ మాట్లాడుతూ చదువులతల్లి సావిత్రిబాయితో కలిసి ఉపాధ్యాయురాలిగా పనిచేసిన తొలి ముస్లిం మహిళ ఫాతిమా షేక్ అని తెలిపారు. బాలికల చదువు కోసం తన అన్న ఇంటిని పాఠశాలగా మార్చిన ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, ఎండీ హసన్, షబ్బీర్, అహ్మద్, రసూల్, హనీఫ్, యాకూబ్, చాంద్ పాషా, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, రవి, రవీంద్ర, బాలయ్య, రాజయ్య, పాండు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమా షేక్ సేవలు అభినందనీయం

గజ్వేల్, జనవరి 9 : ముస్లిం, మైనార్టిటీ బాలికలు, మహిళల కోసం ఉద్యమించిన ఫాతిమా షేక్ 192వ జయంతి సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని అనంతరావుపల్లిలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండ స్వామి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల విద్య కోసం నిరంతరం కృషి చేసిన ఫాతిమా షేక్ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, నర్సింహులు, సుదర్శన్, రవి, నర్సవ్వ, యాదవ్వ, బాలవ్వ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడిలోకి..

పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న కానిస్టేబుళ్లు

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 9 : మండలంలోని ధర్మారం గ్రామ శివారు పిట్టలగూడెంలో బడికి వెళ్లని సుమారు 30 మంది పిల్లలను పోలీసులు గుర్తించి మంగళవారం ధర్మారం ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. అంతకుముందు పిల్లల తల్లిదండ్రులకు చదువుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రత్నప్రభ, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గోదారంగనాథస్వామి కల్యాణం

గోదారంగనాథస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నంగునూరు, జనవరి 9 : మండల పరిధిలోని పాలమాకుల వేంకటేశ్వరాలయంలో మంగళవారం గోదారంగనాథ స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. సిద్దిపేట వికాస తరంగిణి ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేంకటేశ్వరాలయ దాతృత్వ సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి విష్ణుతేజాచార్యులు, వికాస తరంగిణి భక్త బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

హౌసింగ్ బోర్డు కమాన్ వద్ద మ్యాన్‌హోల్

సిద్దిపేట అర్బన్, జనవరి 9 : పట్టణంలోని హౌసింగ్ బోర్డు కమాన్ వద్ద మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. హైదరాబాద్– సిద్దిపేట రహదారి పక్కన ఎలాంటి సూచిక బోర్డు లేకుండా మ్యాన్ హోల్ ఉండడంతో వాహనదారులు భయపడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ మూసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

లక్కీడ్రాలో రైతుకు కారు

కోహెడ, జనవరి 9 : జాండీ ట్రాక్టర్స్ కంపెనీ జిల్లావ్యాప్తంగా నిర్వహించిన కూపన్ లక్కీడ్రాలో మంగళవారం రూ.9 లక్షల విలువైన హుండాయ్ కారును సముద్రాల గ్రామానికి చెందిన రైతు అప్పిస మోహన్ గెలుచుకున్నారు. ఏటా డిసెంబర్‌లో నిర్వహించే లక్కీడ్రాను జనవరిలో హైదరాబాద్‌లో నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా బహుమతులను ప్రకటించారు. ఇప్పటివరకు 3 సార్లు ట్రాక్టర్ కొనుగోలు చేశానని, ఇప్పుడు కారు రావడంతో సంతోషంగా ఉందని రైతు తెలిపాడు.

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 9 : మద్దూరు మండలం గాగిళ్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఆట వస్తువులు, మైక్‌సెట్ అందజేశారు. గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన తవిటి భూమయ్య మిత్రులు జినేశ్, మోహిత్(హైదరాబాద్) రూ.50 వేల విలువైన ఆట వస్తువులు, మైక్‌సెట్‌ను మంగళవారం హెచ్ఎం గుడిసె అంజయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లు కృష్ణవేణీచంద్రమౌళి, ఎస్ఎంసీ చైర్మన్ తవిటి సంధ్య, వార్డు సభ్యుడు గొడుగు బాలరాజు, ఉపాధ్యాయులు కనకయ్య, ప్రేమ్‌కుమార్, ఆంజనేయులు, సరళ, సుహాసిని, సరోజినీదేవి, అనురాధ పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు, ఒకరు మృతి

బెజ్జంకి, జనవరి 9 : మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ శివారులో రాజీవ్ రహదారిపై కారు కల్వర్టును ఢీకొన్నడంతో ఒకరు మృతి చెందారు. ఏఎస్సై శంకర్‌రావు వివరాల ప్రకారం.. జగిత్యాలకు చెందిన మహ్మద్‌పాషా, సోహెల్, మహ్మద్ అస్లాం ముగ్గురు వ్యక్తులు మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా బెజ్జంకి క్రాసింగ్ శివారులో కారు కల్వర్టును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మహ్మద్ అస్లాం అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మహ్మద్ అస్లాం సోదరుడు మోహిజ్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

సుతారి సంఘం అధ్యక్షుడిగా నర్సింహులు

సిద్దిపేట టౌన్, జనవరి 9 : పట్టణ సుతారి పెద్ద సంఘం అధ్యక్షుడిగా తోట్ల నర్సింహులు ఘనవిజయం సాధించారు. రెండేండ్లుగా కొనసాగే అధ్యక్ష, కార్యదర్శుల పదవికి బీఎన్ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ఆధ్వర్యంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్ష పదవి కోసం తోట్ల నర్సింహులు, తోట్ల పరశురాములు బరిలో నిలిచారు. తోట్ల పరశురాములుపై తోట్ల నర్సింహులు 25 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శిగా దరిపల్లి ఎల్లయ్య, కోశాధికారిగా బాలకిషన్ గెలుపొందారు.

రవాణాశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా లక్ష్మణ్

సిద్దిపేట టౌన్, జనవరి 9 : రవాణా శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా లక్ష్మణ్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీటీవోగా పని చేసిన జనార్దన్ రెడ్డిని హుస్నాబాద్ ఎంవీఐగా బదిలీ చేశారు. కొంతకాలంగా జిల్లా రవాణా కార్యాలయంలో ఎంవీఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్ సిద్దిపేట డీటీవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)
సిద్దిపేట మెయిన్ బ్రాంచ్
మెదక్‌రోడ్, సిద్దిపేట.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీక